# పిల్లలు, మహిళలకు పౌష్టికాహారం అందించాలి

- జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి



**ప్రజానావ, ఆసిఫాబాద్ :** జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పిల్లలు, గర్భిణులు, బాలింతలు, కిషోర బాలికల సంక్షేమం దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఈ క్రమంలో పిల్లలు, మహిళలకు సకాలంలో పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి అన్నారు. శుక్రవారం జిల్లాలోని ఆసిఫాబాద్ మండలం సాలెగూడ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. రిజిస్టర్లు, నిత్యవసర సరుకులు, పరిసరాలతో పాటు అంగన్వాడీ కేంద్రం వద్ద చేపడుతున్న నవీకరణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పిల్లలు, మహిళల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. పిల్లల మానసిక, శారీరక ఎదుగుదలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ లోపం కలిగిన పిల్లలను గుర్తించి వారికి సకాలంలో పౌష్టిక ఆహారం, మందులను అందించి సాధారణ స్థితికి తీసుకువచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అంగన్వాడి కేంద్రం పరిధిలో గర్భం దాల్చిన మహిళలు సమీప ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఉత్తమ వివరాలు నమోదు చేసుకుని సమయానుసారంగా పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు తీసుకునేలా చర్యలు తీసుకోవడంతో పాటు గర్భస్థ సమయంలో తీసుకోవలసిన పౌష్టిక ఆహారంపై అవగాహన కల్పించాలని తెలిపారు. అనంతరం ఆసిఫాబాద్ మండలం బూరు గూడ గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజనం నాణ్యత వివరాలను పరిశీలించారు. విద్యార్థులకు నూతన మెనూ ప్రకారం పోషక విలువలు కలిగిన ఆహారాన్ని సకాలంలో అందించాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. పాఠశాలకు గైరహాజరు అయ్యే విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారిస్తూ పాఠశాలకు హాజరయ్యేలా వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ నిర్వహించాలని తెలిపారు. వార్షిక పరీక్షలు సమీపిస్తున్నందున పాఠశాలలను ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ వహించి పరీక్షలకు సన్నద్ధం చేయాలని తెలిపారు. 10వ తరగతి వార్షిక పరీక్షలలో 100 శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా విద్యార్థులచే ప్రణాళికాబద్ధంగా చదివించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి ఆడెపు భాస్కర్, సీడీపీవో, సూపర్‌వైజర్, మండల విద్యాధికారి, పాఠశాల హెచ్‌ఎంలు, అంగన్ వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# కుంభమేళా భక్తులకు అల్పహారం

**ప్రజానావ, ఇచ్చోడ :** ఇచ్చోడ గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త నిమ్మల సంతోష్ రెడ్డి ఆధ్వర్యంలో కుంభమేళా కోసం ప్రయాగ్ రాజ్ వెళ్తున్న వివిధ రాష్ట్రాల నుంచి వస్తున్న భక్తుల వాహనాలను ఆపి వారికి పులిహోర ప్యాకెట్స్, తాగు నీరు అందించారు. సామాజిక సేవలోనే ఆత్మ సంతృప్తి ఉందని సంతోష్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్తలు గోతి సునీల్, సాబ్లే గోవింద్, సింగారపు లక్ష్మణ్, గూడూరు రాజారెడ్డి తదితరులు ఉన్నారు.

# ప్రసన్న హరికృష్ణను గెలిపించాలి

## మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప



**ప్రజానావ, పెంచికల్‌పేట్:** పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణను గెలిపించాలని సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప కోరారు. శుక్రవారం పెంచికల్‌పేట్ మండలంలో యువకులతో కలిసి ప్రచారం చేశారు. పట్టభద్రుల తరపున మండలిలో ప్రశ్నించే గొంతుక ప్రసన్న హరికృష్ణ అని, మంచి చదువుకున్న విద్యావేత్త ఎంతో మంది యువకులకు విద్యాబుద్ధులు నేర్పిన విద్యావేత్త హరికృష్ణ అని విద్యార్థులకు అనేక రకాలుగా సహాయసహకారాలు అందించిన గొప్ప వ్యక్తి హరికృష్ణ అని తెలిపారు. పార్టీలు కతీతంగా ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రసన్న హరికృష్ణ గారికి మద్దతు తెలిపి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.

# కాంగ్రెస్ వైపే పట్టభద్రులు

## భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ



**ప్రజానావ, నేరడిగొండ:** పట్టభద్రులు కాంగ్రెస్ వైపే చూస్తున్నారని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా శుక్రవారం బోథ్ అసెంబ్లీ ఇన్‌చార్జి ఆడే గజేందర్ ఆధ్వర్యంలో బోథ్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ ఏడాదిలోపే 55 వేలకు పైన ఉద్యోగాలు ప్రజా ప్రభుత్వం కల్పించిందన్నారు. 11వేల పోస్టులతో డీఎస్సీ నిర్వహించి ఉపాధ్యాయుల్ని నియమించామని తెలిపారు. జాబ్ క్యాలెండర్ ప్రకారమే టెట్ ఎగ్జామినేషన్ నిర్వహించామని, ఎమ్మెల్సీ కోడ్ పూర్తికాగానే మరో డీఎస్సీ ఎగ్జామ్ నిర్వహిస్తామన్నారు. అదేవిధంగా ఎస్జీటీ ఉపాధ్యాయులకు ప్రమోషన్లు కల్పించామని, ఇలాంటివి ఎన్నో గొప్ప పనులు చూసి పట్టభద్రులందరూ కాంగ్రెస్‌కే మొగ్గు చూపుతున్నారన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజారిటీతో ఆయనను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కేంద్రమంత్రి వేణుగోపాలాచారి, మాజీ ఎంపీ సోయం బాపురావు, బోథ్ మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాబురావు, టీపీసీసీ జనరల్ సెక్రెటరీ సత్తు మల్లేష్, ఏడీసీసీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్లు బొడ్డు గంగారెడ్డి, సత్యవతి కోటేష్, మాజీ జడ్పీటీసీలు గోక గణేష్ రెడ్డి, మల్లెపూల నరసయ్య, బాబన్న, మాజీ ఎంపీపీ కల్యాణరాజేశ్వర్, మాజీ ఏఎంసీ చైర్మన్లు నారాయణ సింగ్, ఆడే షీలా, రాజు యాదవ్ బ్లాక్ కమిటీ అధ్యక్షులు ప్రఫుల్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షులు పోతరెడ్డి, మండల అధ్యక్షులు జల్కే పాండురంగ్, కరుణాకర్, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# దోమల నివారణకు చర్యలు




**ప్రజానావ, నర్సాపూర్(జీ):** మండలంలో చాక్ పల్లి గ్రామంలో దోమల బెడద నుండి తప్పించేందుకు గ్రామ పంచాయతీ స్పెషల్ ఆఫీసర్ ఎంపీవో తిరుపతి రెడ్డి సూచన మేరకు గ్రామపంచాయతీ కార్యదర్శి నరేష్ కుమార్ మల్టీపర్పస్ సిబ్బందితో దోమల నివారణకు ఫాగింగ్ చేయించారు. ఈ వారంలో పారిశుధ్య పనులు దశలవారీగా చేపట్టి ప్రజలకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఫాగింగ్ తర్వాత పారిశుధ్య పనులు పూడికతీత బ్లీచింగ్ పౌడర్ చల్లడం వంటివి నిరంతర ప్రక్రియగా కొనసాగిస్తామని తెలిపారు. అడ్డిగ సాయన్న, రసూల్, మల్టీపర్పస్ సిబ్బంది పాల్గొన్నారు.



మహా శివరాత్రి జాతర ఏర్పాట్లను పరిశీలించిన వేములవాడ అలయ ఈఓ వినోద్ శుక్రవారం పరిశీలించారు. ఇందులో భాగంగా ధర్మగుండం, కోడెకట్టుట క్యూ, ఓపెన్ స్లాబ్, 300 బ్రేక్ క్యూ లైన్, కల్యాణ కట్ట, పార్కింగ్ ప్లేస్ పరిశీలించి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఆయన వెంట ఈఈ రాజేష్, డీఈ మైపాల్, ఏఈ రామ్ కిషన్ రావు, ఏఈఓలు శ్రావణ్ కుమార్, బ్రహ్మన్నగారి శ్రీనివాస్, ఆలయ ఉద్యోగులున్నారు.

- ప్రజానావ, వేములవాడ



# అపార్ గుర్తింపు కార్డుల జెనరేట్ వేగవంతం చేయాలి

## జిల్లా విద్యా శాఖ అధికారిని ప్రణిత

**ప్రజానావ, ఆదిలాబాద్ :** జిల్లాల్లోని అన్ని పాఠశాలల్లో పాఠశాలలో అపార్ గుర్తింపు కార్డుల జెనరేట్ వేగవంతం చేయాలని జిల్లా విద్యా శాఖ అధికారిని ప్రణిత అన్నారు. శుక్రవారం ఇచ్చోడ మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత ఉర్దూ మీడియం పాఠశాల,తెలుగు మీడియం పాఠశాలలను సందర్శించి విద్యా భోదన పిల్లల హాజరు శాతం తదితర వాటని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమే మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి అపార్ గుర్తింపు కార్డు జెనరేట్ చేయించడమే కాకుండా వాటిని ప్రింట్ తీయించి విద్యార్థులకు అందించాలని, వారు ప్రతిరోజూ మెడలో వేసుకొని పాఠశాలకు వచ్చేలా చొరవ తీసుకోవడం అభినందనీయమని అన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (ఉర్దు) ప్రధానోపాధ్యాయులు, కసావత్ బిక్కు సేవలను జిల్లా విద్యాశాఖ అధికారి కొనియాడారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇచ్చోడ టెలుగు మిడియం సందర్శించారు. ఆశించిన స్థాయిలో విద్యార్థులకు కూడా అపార్ గుర్తింపు కార్డులు జెనరేట్ కాకపోవడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రక్రియ వేగవంతం చేయాలని సూచించారు. ఆమే వెంట సెక్టోరల్ అధికారి జే నారాయణ,మండల విద్యాధికారి కసావత్ బిక్కు ఉన్నారు.



# రోడ్డు వేయకుండానే బిల్లులు డ్రా!

## మంత్రి అనుచరుడి నిర్వాకం

## బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి

**ప్రజానావ, ములుగు/ కన్నాయిగూడెం:** ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం బుట్టాయిగూడెంలో రోడ్డు వేయకుండానే వేసినట్లు మంత్రి అనుచరుడు రికార్డులు సృష్టించి బిల్లులు డ్రా చేసుకున్నారని బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి డా. జాడి రామరాజు నేత ఆరోపించారు. శుక్రవారం బీజేపీ మండల అధ్యక్షురాలు దుర్గం సమ్మక్క ఆధ్వర్యంలో నాయకులు రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంత్రి అనుచరుడు, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు తాటి రాజబాబు రోడ్డు నిర్మాణం చేయకుండానే మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం ద్వారా తాటి సత్యం ఇంటి నుంచి కావేరి నాగయ్య ఇంటివరకు రోడ్డు పోసినట్టు రికార్డు చేసుకొని బిల్లు డ్రా చేసుకున్నారన్నారు. దీనిపై గ్రామంలోని యువకులు, మేధావులు ఆలోచించాలన్నారు. ఆదివాసీ, దళిత, బహుజన వర్గాల ప్రజలు నివసించే పల్లెలు ప్రగతి సాధించాలంటే అవినీతి, అక్రమాలు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి జనగాం ఆనంద్, ఉపాధ్యక్షురాలు పానుగంటి సంగీత, బూత్ అధ్యక్షుడు కావేరి నాగయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# దమ్ముంటే ఆధారాలు తీసుకురా..

## ప్రజల సమక్షంలోనే తేల్చుకుందాం

- సమాచారం తెలియకుండా మతిభ్రమించి మాట్లాడుతున్నారు
- బీజేపీ నేత జాడి రామరాజుపై కాంగ్రెస్ కిసాన్ అధ్యక్షుడు రాజబాబు ఫైర్

**ప్రజానావ, ములుగు ప్రతినిధి:** ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలోని బుట్టాయిగూడెం గ్రామంలో ఇద్దరు, ముగ్గురి పేర్లతో తెలిసి తెలియని వార్తను గ్రూప్ లో విడుదల చేయడం సిగ్గుచేటని బీజేపీ నేత జాడి రామరాజుపై కాంగ్రెస్ కిసాన్ అధ్యక్షుడు తాటి రాజబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాజబాబు మాట్లాడుతూ ఇటీవల బుట్టాయిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలో మహాత్మాగాంధీ జాతీయ రోడ్డు నిర్మాణ ఉపాధి పథకం ద్వారా దేవరకొండ సత్యం ఇంటి వద్ద నుంచి కావిరి నాగయ్య ఇంటి వరకు రోడ్డు నిర్మాణానికి కొలతలు మాత్రమే తీసుకున్నామన్నారు. అయితే సీసీ రోడ్డు నిర్మాణం మాత్రం దేవరకొండ సత్యం దగ్గర నుంచి జాడి శంకరయ్య ఇంటి వరకే చేపట్టినట్లు పేర్కొన్నారు. దేవరకొండ సత్యం ఇంటి దగ్గర నుంచి కావేరి నాగయ్య ఇంటి వరకూ 250 మీటర్లు ఉండగా, అది కేవలం కొలతలు మాత్రమేనని, ఒక్క 5 లక్షల బిట్టు పోయాలి అంటే 85 మీటర్ల నుంచి 90 మీటర్ల వరకే ఉంటుందన్నారు. అది కేవలం 5 లక్షల బిట్టే దానికి ఇంకా బిల్లులు కూడా పడలేదన్నారు. అంతేకాని తెలిసి తెలియక రోడ్డు పోయకుండానే బిల్లులు తీసుకోవడం అని ప్రెస్ నోట్ ఇవ్వడం ఏంటిని మండిపడ్డారు. దీనికి సంబంధించి ఏమైనా ఆధారాలుంటే ప్రజల సమక్షంలో కూర్చుని తెల్చుకుందామన్నారు. దమ్ముంటే ప్రజల ముందుకు రావాలన్నారు.

### మంత్రి విమర్శించే అర్హత నీకుందా?

మంత్రి గురించి తప్పుగా మాట్లాడటం తగదని మంత్రిని విమర్శించే అర్హత జాడి రామరాజుకు లేదన్నారు. జనంలో ఉండాలని మంత్రిపై రోజుకో విమర్శ తేవడం తగదని హెచ్చరించారు. ఇలా నీతి తక్కువ రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు. ఇకనుంచి తప్పుడు ప్రచారాలు చేస్తే ఊరుకునేది లేదని రాజబాబు హెచ్చరించారు.

